www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 13 ఆగస్టు 2024

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - కడప

పిల్లలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి చదివిన సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనాలు, తరగతి గదులు, లైబ్రరీ, టాయిలెట్లను పరిశీలించారు. జీవన పరిస్థితులు, కాలానుగుణ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రిన్సిపల్‌ని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వివరాలను, సాయంత్రం స్నాక్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నీరు-చెట్టు బిల్లుకు మోక్షం!

- రూ.80 కోట్ల బకాయి చెల్లింపు
- సిఎఫ్ఎంఎస్ అప్‌లోడ్‌కు పరుగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నీరు-చెట్టు బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా నీటిపారుదలశాఖ 2018-19లో రూ.120 కోట్లతో కూడిన పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడగానే నవరత్నాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చింది. టిడిపి ప్రభుత్వ హయాంలోని 1,690 పనులకు సంబంధించిన రూ.80 కోట్ల బిల్లుల చెల్లింపులను నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. 2019 డిసెంబర్‌లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులకు హైకోర్టును ఆశ్రయించి 12 శాతం వడ్డీతో సహా చెల్లింపులు చేయిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. అనంతరం ఆర్థిక సామర్థ్యం కలిగిన కొంత మంది బిల్లుల చెల్లింపుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడేళ్లుగా నీరు-చెట్టు పనులకు సుమారు రూ.15 కోట్ల మేరకు బిల్లులు చెల్లింపులు చేయించుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులకు మోక్షం లభించింది. కూటమి సర్కారు నీరు-చెట్టు చెల్లింపులకు బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయింపులు చేసింది. ఉమ్మడి కడప జిల్లాలోని 1690 పనుల్లో 800 పనులకు రూ.40 కోట్లు మేరకు చెల్లింపులు చేసింది. 2024 సెప్టెంబర్ నాటికి మిగిలిన సుమారు 800 పనులకు సంబంధించిన రూ.40 కోట్లను నీరు-చెట్టు పనులు చేసిన వారికి చెల్లింపులు చేయనున్నారు. జిల్లాలో నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు తమ పనుల వివరాలను సిఎఫ్ఎంఎస్ అప్‌లోడ్ చేసుకోవడానికి పరుగులు తీస్తుండడం గమనార్హం.

ఎట్టకేలకు నీరు-చెట్టు బిల్లు చెల్లింపులకు మోక్షం లభించింది. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో నీరు-చెట్టు పథకం పెండింగ్ బకాయి చెల్లింపులకు రూ.250 కోట్లు కేటాయించింది. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలోని నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈనేపథ్యంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన పలువురు కార్యకర్తలు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సిఎఫ్ఎంఎస్‌లో తమ పనులు అప్‌లోడ్ చేసుకునేందుకు పరుగులు తీస్తుండడం గమనార్హం.

పని సర్దుబాటులోని
లోపాలు సవరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

పని సర్దుబాటులోని లోపాలను సవరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం డిఇఒ కార్యాలయంలోని పరిపాలనాధికారి మునీర్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను మనోవేదనకు గురి చేసే విధంగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జీవోలతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం తగదని తెలిపారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులందరినీ మిగులు ఉపాధ్యాయులుగా చూపడం సబబు కాదన్నారు. ఒకటి నుంచి రెండవ తరగతి వరకు 20 మంది పైబడి విద్యార్థులు ఉన్నప్పటికీ అక్కడ ఒక ఉపాధ్యాయుని మాత్రమే కొనసాగించి మిగిలిన వారిని మిగులు ఉపాధ్యాయులుగా చూపారని పేర్కొన్నారు. ఏడాదిలోపు ఉద్యోగ విరమణ పొందుతున్న వారిని కూడా మిగులు ఉపాధ్యాయులుగా చూపారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ప్రభుత్వం తెలియ జేసినా మినహాయింపులు ఉన్నవారిని సైతం సర్దుబాటు ప్రక్రియలో మిగులు ఉపాధ్యాయులుగా చూపారని వీటన్నింటిని సవరించిన తర్వాతే సర్దుబాటు ప్రక్రియ కొనసాగించాలని కోరారు. మిగులుగా ఉన్న జూనియర్ ఉపాధ్యాయుల స్థానంలో ఆసక్తి కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను పని సర్దుబాటులో ప్రాధాన్యత పొందు పరచాలని విజ్ఞప్తి చేశారు. **కలసపాడు :** ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధాలతో లోపభూయిష్టంగా ఉన్నందున ఉపాధ్యాయ సంఘాలుగా సర్దుబాటును బహిష్కరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రాష్ట్రనేత పి.రమణారెడ్డి తెలిపారు. సోమవారం కలసపాడులోని మండలవిద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంఇఒలు పి.ఎం.ప్రేమసాగర్, ఎస్.మస్తాన్‌లకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ , రకరకాల ప్రయోగాలకు విద్యారంగాన్ని వేదికగా మార్చి, ప్రభుత్వ విద్యారంగం నష్టపోయేలా చేస్తు న్నారన్నారు. ఈమధ్య జరిగిన చర్చలలో ఉపాధ్యాయ సంఘాలుగా చెప్పినటువంటి ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా రాష్ట్ర విద్యాశాఖ ఈ ప్రక్రి యను అత్యవసరంగా చేపడుతుందని తెలిపారు. తక్షణం స్పందించి జీవో 117 ను రద్దు చేయాలని, జీవో 53 ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయ కులు సి.వెంకటరెడ్డి, కె.క్రిష్ణారెడ్డి, బి.ఎన్.వి.ప్రసాద్, శేఖర్‌బాబు, బాలజీ, ఎస్.వి. సత్యనారాయణ, కె.వి.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, శివారెడ్డి, బాలరాజునాయక్, కిరణ్ కుమార్, విజయభాస్కర్ రెడ్డి, బాలచెన్నయ్య, గురుప్రసాద్, రామకృష్ణారెడ్డి ,మస్తాన్, తిరుపతిరెడ్డి, గురయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు

ప్రజా సమస్యలు నేరుగా వింటున్న ఎస్‌పి వి. హర్షవర్ధన్‌రాజు

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి జిల్లా ఎస్‌పి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖిగా మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులను మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారించి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి జి.వెంకటరాముడు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

నగరంలో పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్

అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం మార్నింగ్ విజిట్‌లో భాగంగా సోమవారం నాగరాజుపేట, పాత బస్టాండ్, పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంతాలను ఇంజినీరింగ్ విభాగ అధికారులు, శానిటేషన్ విభాగా అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా నాగరాజు పేటలో పరిశుధ్య కార్మికుల హాజరు పట్టిక పరిశీలిస్తూ శానిటేషన్ సెక్రటరీలు విధుల లో ఎటువంటి జాప్యం చేయరాదని పేర్కొన్నారు. కార్మికులతో వారికి కేటాయించిన సమయానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటూ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు కేటాయించినటువంటి ఐడీ కార్డ్స్, బ్యాచ్ లను తప్పనిసరిగా ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు వారికి ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాత బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఎటువంటి జాప్యం ఉండరాదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వతంత్ర దినోత్సవ సందర్భంగా పోలీస్ పీరియడ్ గ్రౌండ్‌లో చేయవలసిన పనుల గురించి శానిటేషన్ విభాగా అధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ ఇ రత్నాల రాజు, ఎంహెచ్ఓ చంద్రశేఖర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులతోపాటు ప్రజల హృదయాలలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించాలని డిఇఒ అనురాధ తెలిపారు. ఈనెల 15 వరకు భారతదేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ తన ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి సూచించారన్నారు. జాతీయ జెండా ఎగురవేయడాన్ని ప్రోత్సహించేందుకు 'హర్ ఘర్ తిరంగ' కాలర్ ట్యూన్‌ను అందరి ఫోన్ లలో వినిపించాలన్నారు. విద్యార్థులు, ప్రజలు త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలను 'హర్ ఘర్ తిరంగ' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జాతీయ జెండాను ఎగురు వేయడంలో, వినియోగించడంలో జెండా గౌరవానికి భంగం కలగకుండా ఫ్లాగ్ కోడ్ గురించి తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఆ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. భారత జాతీయ జెండా గురించి విద్యార్థులకు అవగాహనను పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అందరూ పాల్గొనాలని కోరారు.

హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాల విద్య పూర్వ ఆర్‌జెడి వై.రాఘవరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలో సుండుపల్లె ఎంఇఒను మాత్రమే బాధ్యుడిని చేస్తూ, మిగతా నలుగురిపై చర్యలు తీసుకోక పోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురి ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఒక్క ఎంఇఒను మాత్రమే బాధ్యున్ని చేయడం తగదన్నారు. పూర్వ ఆర్జేడీ వై.రాఘవరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్.ఎం.ప్రసన్నకుమార్‌ను విచారణాధికారిగా నియమించి ఆరోపణలపై విచారణ చేపట్టిందని పేర్కొన్నారు. ఆ మేరకు జులై 18, 19 తేదీలలో కడపలోని డిఇఒ కార్యాలయంలో విచారణాధికారి విచారించారు. విచారణకు విచారణాధికారి నుంచి ఏలాంటి పిలుపు లేకపోయినా అన్నమయ్య జిల్లాకు చెందిన సుండుపల్లె మండల ఎంఇఒ వెంకటేష్ నాయక్, డిసిఇబి సెక్రెటరీ నాగముని రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, రాయచోటి మండలం మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఓబులవారిపల్లె మండలం మంగంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గడ్డం ఆదినారాయణరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా విచారణకు హాజరయ్యారని తెలిపారు. పైగా వీరంతా ఆయా పాఠశాలల్లో విధులకు హాజరైనట్లు బయోమెట్రిక్ వేసి విచారణకు హాజరయ్యారని తెలిపారు. ఆర్జేడి అవినీతిపై ఫిర్యాదు చేయడానికి విచారణకు వచ్చిన సుండుపల్లె మండలం, జి.కె.రాచపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై ఐదుగురు ఉపాధ్యాయులు దాడి చేసి సెల్ ఫోన్ పగలగొట్టారని, ఆ మేరకు నగర పరిధిలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో 262/2024 గా ఎఫ్ఐఆర్ నమోదయిందని చెప్పారు. సుండుపల్లె ఎంఇఒ వెంకటేష్ నాయక్‌ను ఈనెల 2న సస్పెండ్ చేస్తూ ఆర్జేడి కె.శామ్యూల్ ఉత్తర్వులు వెలువరించారన్నారు. అయితే ఈ ఘటనలో ఒక్కరిని మాత్రమే సస్పెండ్ చేస్తూ మిగతా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన ఎంఇఒపై చర్యలు తీసుకుని మిగతావారిపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం సరైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ నలుగురు ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్,లోకేష్ పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అర్జీదారులకు న్యాయం చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జెసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి మురారి

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కలసపాడు

సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచా యతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ, ఇఒపిఆర్‌డి మురారి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు, సర్పంచులకు కార్యదర్శులకు, గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్య, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మి కంపోస్ట్ తయారీ, పంచాయతీ అభివృద్ధికి తగిన ప్రణాళికలు, ఆర్థిక వనరుల సమీకరణ ఎలా సమీకరించుకోవాలి, అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు మండలంలోని 11 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్ర మంలో టిఒ మహేష్, సెక్రెటరీ శ్రీధర్, సర్పంచులు సుధా, రామకృష్ణారెడ్డి, శివ లీల, రాంబాబు, సుశీలమ్మ, ఓబులమ్మ, జయన్న, గురమ్మ, పుల్లెం. నారాయణ , వెంక టయ్య, శారదమ్మ, సాధనకారి రామసుబ్బమ్మ, శ్రీనివాసులు, సుజన, అంకన్న గోవిందమ్మ, రవణమ్మ, నవీన్ కుమార్, సెక్రటరీలు, వసంత, సృజన, రవీంద్రారెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

ఎస్ఐగా చిరంజీవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కలసపాడు

మండల ఎస్ఐగా చిరంజీవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. మండలాన్ని ప్రశాంత వాతావరణంలో ఉంచేందుకు తమ వంతు కృషి. చేస్తామని తెలిపారు.

'డయల్ యువర్ కలెక్టర్'కు పది ఫిర్యాదులు

ప్రజాశక్తి - కడప

ఫోన్‌ద్వారా ప్రజాసమస్యలు వింటున్న జెసి

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. ఫిర్యాదులకు సంబంధించిన శాఖల అధికా రులతో వెంటనే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. మైదుకూరు మండలం నంద్యాల రోడ్డులో నివాసముంటున్న సి .ఆంజనేయులు నంద్యాల రోడ్డులో గుడి పక్కనే బార్ ఉందని, విచారించి తొలగించాలని కోరారు. రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామం చెందిన ఎ.గోపాల్ 93 ఎకరాల స్థలం కబ్జాలో ఉందని తమకు న్యాయం చేయాలని కోరారు. గోపవరం మండల కేంద్రానికి చెందిన గురు హరి ప్రసాద్ 1994-4 సర్వే నెంబర్‌లో 92 సెంట్లు భూసేకర చేశారని, సదరు భూమిలో తనకు సంబంధించిన రోడ్డు ఉందని ప్రభుత్వం వారు సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు. అట్లూరు మండలం తుమ్మల గండి చెందిన బ్రహ్మానందరెడ్డి తన అధీనంలో ఉన్న సర్వే నెంబరు 416/2 లో 4 ఎకరాల 96 సెంట్లు డీకేటి ల్యాండ్ అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నారని తమ స్థలం తమకు న్యాయం చేసి ఇప్పించాలని కోరారు.

బలవంతపు రాజీనామాలు ఆపాలని వినతి

ప్రజాశక్తి-చెన్నూరు

రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులైన అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్నం భోజన కార్మికులను బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారని, వెంటనే ఆపాలని ఎఐటియుసి నాయకులు ఎంఇఒ జీవన్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది రాజకీయ నాయకులు పలు ప్రాంతాలలో చిన్నచిన్న ఉద్యోగులను రాజీనామా చేయాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. అందులో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్నం భోజన కార్మికులను ఇష్టం లేకపోయినా రాజీనామాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు అయ్యవారమ్మ, నాయకులు అనసూయ, ఉమామహేశ్వరి, రాజేశ్వరి, సులోచన పాల్గొన్నారు.

విక్రమ్ సారాబాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

విక్రమ్ సారాభాయ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - కడప అర్బన్ : విక్రమ్ సారాబాయ్ భారత అంతరిక్ష పితామహుడని, దేశానికి ఆయన చేసిన సేవలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యునివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎన్.రాజేష్ కుమార్ రెడ్డి అన్నారు. విక్రమ్ సారాభాయ్ జయంతిని పురస్కరించుకుని కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సారాభాయ్ స్ఫూర్తితో విద్యార్థులు గణితం, రసాయనం, భౌతిక శాస్త్రాల్లో పరిశోధనలు చేసి శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎన్.రాజేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విక్రమ సారాబాయ్ దేశంలో పలు ప్రతి ష్టాత్మక సంస్థలను నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ ఫణీంద్ర రెడ్డి, వివిధ విభాగాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సోమవారం మండల పరిధిలోని హస్తవరం వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోరుమామిళ్లకు చెందిన మృతుడు పవన్ కళ్యాణ్ (18) అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యలపైన విచారణ జరిపించాలి : ఎస్ఎఫ్ఐ

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జరుగు ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేధింపుల ద్వారానే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం

ప్రజాశక్తి-చెన్నూరు

మండల ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య బదిలీ సందర్భంగా చెన్నూరు పోలీస్ స్టేషన్ సోమవారం సాయంత్రం సహద్యోగ పోలీసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐలు ఆంజనేయులు, జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ పుల్లయ్య తన ఉద్యోగ నిర్వహణలో ప్రజల చేత ఎన్నో మన్ననలు పొందారని తెలిపారు. యన తన సహద్యోగులతో ఎంతో అన్యో న్యంగా సన్నిహితంగా ఉండడమే కాకుండా ఏ ఇబ్బందులు వచ్చినా వెన్నంటి తోడు నీడగా ఉంటారని చెప్పారు. పుల్లయ్య చింతకొమ్మదిన్నె మండలానికి బదిలీపై వెళ్లడం ఒకింత బాధగా ఉన్నప్పటికీ, ఉద్యోగరీత్యా బదిలీలు తప్పవని ఆయన అక్కడ తన ఉద్యోగ నిర్వహణలో మంచి పేరు సంపాదించుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో తమ సత్తా చాటారు. సోమవారం సౌత్ జోన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ తిరుపతిలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు పాల్గొని 8 గోల్డ్, 3సిల్వర్, 1బ్రాంజ్ గెలుచుకున్నారు. వీరిలో 8వ తరగతికి చెందిన మహమ్మద్ సుమయా (2 గోల్డ్ మెడల్స్), 6వ తరగతికి చెందిన షేక్. ఇబ్రహీం (రెండు గోల్డ్ మేడల్స్), 7వ తరగతికి చెందిన షేక్.రిమాస్ (రెండు గోల్డ్ మెడల్స్), 4వ తరగతికి చెందిన షేక్.ఖాళీద్ (2గోల్డ్ మెడల్స్), 6వ తరగతికి చెందిన సి.ఎస్. ఇసాక్ (1సిల్వర్, 1బ్రాంజ్), 6వ తరగతికి చెందిన సయ్యద్ ఇబ్రహీం ఖలీలుల్లా (2సిల్వర్ మెడల్స్) సాధించినారని పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు. మా పాఠశాలలో విద్యతో పాటు కరాటే లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

పతాకావిష్కరణలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఐక్య విద్యార్థి ఉద్యమ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వరుణ్ హై స్కూల్ ఆవరణలో సోమవారం స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో కూడిన ఎస్ఎఫ్ఐ జెండాను యూనియన్ మండల అధ్యక్షులు కలివేల రాజశేఖర్ ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సోమిరెడ్డిపల్లె అరవింద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నేడు విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రస్తా సౌకర్యం కల్పించాలని తహశీల్దార్‌ను కోరుతున్న రైతులు

వ్యవసాయ పొలాలకు రస్తా కల్పించండి

ప్రజాశక్తి - చక్రాయపేట

మారెళ్లమడక బిసి కాలనీ నుంచి పిల్లిగుండ్ల వరకు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు రాస్తా కల్పించాలని సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ నరసింహులు, రైతులు తహశీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ రాస్తాకు సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మారెళ్లమడక గ్రామ మాజీ సర్పంచ్ నరసింహులు, టిడిపి కార్యకర్త భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' సామాజిక బహిరంగ సభ

ప్రజాశక్తి - చాపాడు

జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులపై మంగళవారం మండల సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7.13 కోట్లు ఖర్చు చేయగా, ఇందులో 1,388 పనులకు సామగ్రికి రూ.1.15 కోట్లు, కూలీల వేతనాలకు రూ.5.98 కోట్లు వెచ్చించినట్లు ఆయన తెలిపారు. పది రోజులుగా సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాలలో పర్యటించి నిధుల వినియోగంపై తనిఖీ చేపట్టారన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి వివరాలను వెల్లడించారన్నారు. మండల స్థాయిలో సభ నిర్వహిస్తున్నామన్నారు.

పంటల నమోదు తప్పక చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మ్యాగీ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పంట నమోదుకు తమ సమీప రైతు సేవా కేంద్రాల్లోని విఏఏలను సంప్రదించాలన్నారు. సెప్టెంబరు 15లోగా ఆధార్, 1బీ, బ్యాంక్ అకౌంట్ ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులు ప్రభుత్వం మంజూరు చేసిన ధృవీకరణ పత్రం జిరాక్స్ జతచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ పథకాలు, పంటల బీమా, నష్టపరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు పంట నమోదు వివరాల ఆధారంగా వస్తాయన్నారు. నమోదు చేసుకోలేకపోతే ప్రభుత్వ లబ్ధి చేకూరే అవకాశం ఉండదన్నారు.

భూపేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సచివాలయ సెక్రెటరీల సమస్యలను పరిష్కరించాలని సచివాలయం సంఘం సభ్యులు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డిని కోరారు. సోమవారం వారు భూపేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీలు మాట్లాడుతూ సచివాలయం కార్యదర్శుల విలీనం నేపథ్యంలో వార్డు పరిపాలన కార్యదర్శులను మాతృత్వ శాఖ అయిన మున్సిపల్ శాఖలో విలీనం చేసి జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ కల్పించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోని రెండేళ్ల సర్వీసునకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. 9 నెలల కాలానికి ఆరియర్స్ బకాయిలు చెల్లించాలని విన్నవించారు. అనంతరం భూపేష్‌రెడ్డి స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాఘవేంద్ర, రఫీ, ఇర్ఫాన్, ప్రవీణ్, యాకోబు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వెల్లువెత్తిన అర్జీలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ గుర్రప్ప ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే కారణంగా తమ భూముల విస్తీర్ణం తగ్గిపోయాయని, వాటిని పరిష్కరించాలని రైతులు కోరారు. పొలం గట్లకు సంబంధించి సర్వే చేయాలన్నారు. ఎలాంటి అర్హత లేకపోయినా గురజాల, సింహాద్రిపురం గ్రామాల్లో ఇంటి నివేశ పత్రాలు ఇచ్చారని, వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని కళాకారులు సూచించారు. ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలు మాత్రమే పూజించాలని అవగాహన కల్పించారు. కళాజాత ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ శ్రీనివాసులు, ఎఇ అనిల్ కుమార్‌రెడ్డి, కళాకారులు రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చిన్నబోతున్న చీనీ కాయల ధరలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చీని ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. ఈ పరిసిత్థుల్లో రైతుల్లో ఆందోళన నెలకొంది. పులివెందుల నియోజకవర్గంలో సింహాద్రి పురం, లింగాల, తొండూరు మండలాల్లో చీనీ పంటను అధికంగా సాగు చేస్తారు. గత నెల మొదటి వారంలో క్వింటా రూ.50వేలు పలికింది. రోజు రోజుకూ తగ్గుతూ ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయింది. రైతుకు గిట్టుబాటు కావడంలేదు. చీనీ కాయలు రేటు తక్కువగా ఉండడంతో నష్టపోవాల్సి వచ్చిందనిచాలా మంది రైతులు వాపోతున్నారు. చీనీ చెట్ల సాగుకు ఖర్చు ఎక్కువగా ఉంటుందని, ధరలు తక్కువగా ఉంటే నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని చీనీ కాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులకు కోరుతున్నారు.

మద్దతు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తే ధరలు నిల కడగా ఉంటాయి. తద్వారా రైతుకు మంచి లాభాలు వస్తాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుని మద్దతు ధర కల్పించాలి.

- మదన్‌మోహన్‌రెడ్డి, రైతు, లింగాల మండలం

ఎరువులు, పురుగు మందులు రాయితీ ఇవ్వాలి

ఎరువులు, పురుగు మందులకు ప్రభుత్వం రాయితీ ఇస్తే రైతుకు కొంతమేర ఆర్థికభారం తగ్గుతుంది. ధరలు తక్కువగా ఉన్నా రైతుకు పెద్దగా నష్టం వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. రైతు నష్టపోకుండా ఉండేందుకు వీలు కలుగుతుంది.

- రామిరెడ్డి, రైతు, లింగాల మండలం

అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక బాధ్యత

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక బాధ్యతని ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం సర్పంచులకు మూడు రోజుల పాటు శిక్షణనిస్తుందన్నారు. విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూపిసి నిర్వాహణ, వీధిలైట్ల నిర్వహణ, అభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీకి ఆదాయ మార్గాలను గుర్తించాలన్నారు. సర్పంచులు, సిబ్బందికి రిసోర్స్ పర్సన్ ధనేశ్వర్ బాబు, సుధాకర్, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

చక్రాయపేట : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడం, వీధి దీపాల నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సోమశేఖర్‌రెడ్డి పలు సూచనలిచ్చారు. శిక్షకులు గంగులయ్య, ప్రేమలత, రుమేష్ నాయుడు, శ్రీహరి, శ్రావణి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి బాలకృష్ణ, ఈఓపిఆర్‌డి శివారెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ముద్దనూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధికి కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వాహణ, విద్యుత్ బిల్లులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఏ విధంగా వినియోగించాలనే ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి అల్తాఫ్ హుస్సేన్, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, ఎంసిఓ కిషోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పంచాయతీ నిధులను సద్వినియోగం చేయాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయ సభ భవనంలో సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో సర్పంచు అధికారాలు, విధులపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వేముల : ఆయా గ్రామాల అభివృద్ధికి సర్పంచులకు, పంచాయతీ సెక్రెటరీలకు సరైన ప్రణాళి తప్పనిసరిగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ అర్జున్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంలో భాగంగా సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా అర్జున్‌రావు మాట్లాడుతూ ఈ శిక్షణ మూడు రోజులపాటు ఉంటుందన్నారు. ప్రతి సర్పంచు, కార్యదర్శి తప్పనిసరిగా హాజరై ప్రభుత్వ విధి. విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి పాల్గొన్నారు.

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రత్యేకదృష్టి పెట్టాలని ఎంపిడిఓ సంపతి దివిజా కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ సభాభవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సంపతి దివిజా

కడప-రేణిగుంట జాతీయ రహదారి పూర్తి చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప-రాజంపేట-రేణిగుంట జాతీయ రహదారి అతి ప్రధానమైందని, వెంటనే పూర్తి చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప-రేణిగుంట జాతీయ రహదారి నిరంతరం రద్దీగా ఉంటుందన్నారు. చెన్నై-ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారి అన్నారు. రూ.2,254 కోట్లతో, 122 కిలోమీటర్ల పొడవుతో 4 వరుసల రహదారి మంజూరైనట్లు తెలిపారు. పనులు చేసేందుకు 2023 అక్టోబర్‌లో టెండర్ పూర్తయిందని చెప్పారు. టెండర్లను కూడా లక్ష్మీ ఇంఫ్రా సంస్థ దక్కించుకుందన్నారు. అయితే 10 నెలలైనా పనులు మొదలు పెట్ట లేదని తెలిపారు. పనులు చేసేందుకు 100 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించి అనుమతి రాకపోవడంతో ఆ పనులు మొదలు కాలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని ఫారెస్ట్ క్లియరెన్స్ తెప్పించి త్వరగా పనులు మొదలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే కడప, అన్నమయ్య జిల్లాలను కలిపే వేంపల్లె-రాయచోటి రోడ్డును కూడా పూర్తి చేయాలని కోరారు. పులివెందుల నుంచి వేంపల్లె, రాయచోటి మీదుగా, ప్రొద్దుటూరు నుంచి వేంపల్లె, రాయచోటి మీదుగా పీలేరు, తిరుపతి మదనపల్లి, బెంగళూరుకు పోవాలన్నా ఇది ప్రధానమైన రోడ్డు అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో 3సంవత్సరాల క్రితం ముందున్న రోడ్డును, కల్వర్టులను తవ్వేశారని చెప్పారు. కాంట్రాక్టర్ చనిపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని తెలిపారు.



డైరెక్టర్ కుమారస్వామి గుప్తాకు సన్మానిస్తున్న డాక్టర్ కోనప్ప

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. మండలంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో సోమవారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని గ్రంథాలయ అధికారి డాక్టర్ కోనప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ గుర్తుగా ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది ఆగస్టు 12న భారతదేశ వ్యాప్తంగా గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ పుస్తకాలను చదివి విజ్ఞాన వంతులుగా కావాలని విద్యార్థులను కోరారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటలు విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు కూడా ఇళ్లల్లో ఒక సొంత గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను గ్రంథాలయ అధికారి డాక్టర్ డి.కోనప్ప శాలువా కప్పి మెమంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలంలో భూమి దక్కించుకున్న కేతవరం రైతు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమిని కౌలుకు ఇచ్చేందుకు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 123/1లో 1.50 ఎకరాలు దేవస్థాన భూమి కౌలుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించామన్నారు. ఈ వేలం పాటలో కేతవరం గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి రూ.11,500 దక్కించుకున్నారన్నారు. మూడు సంవత్సరముల పాటు రైతు భూమి కౌలుకు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ సింగ్, ఆలయ మాజీ చైర్మన్ గుండు వీరయ్య, ఎల్లారెడ్డి, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌కు సంస్కృత విభాగంలో జాతీయ అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక శ్రీగీతం బాలిక జూనియర్ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ పి.లోకేష్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి చదివిన పాఠశాల వాతావరణం, పరిసరాల ప్రభావంతో తనకు సంస్కృత భాషపై మమకారాన్ని పెంచిందని తెలిపారు. అన్ని గ్రంథాల సారాంశం ఒక్కటేనని, ఆత్మవిశ్వాసం పెంచి మనిషిని మనిషిగా తీర్దిదిద్దడమే అన్నారు. లోకేష్ ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల గీతం కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వేముల

వేముల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిన్సిపల్ సుగుణావతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 26 సాయంత్రంలోపు చేరాలన్నారు. 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, కుల సర్టిఫికేట్, ఫొటో, సెల్ నంబర్, ఇ మెయిల్ ఐడితో సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 29న ఉదయం 10 గంటలకు ఐటిఐలో తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని ప్రిన్సిపల్ కోరారు.

తహశీల్దార్‌ను సన్మానించిన ఎంపిపి

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.విజయకుమారిని సోమవారం ఎంపిపి మాధవి బాలకృష్ణ శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. తహశీల్దార్‌ను ఎంపిపి, పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంపిపి, సర్పంచులు

వ్యాపారులకు సూచనలిస్తున్న పోలీసులు

రెండ్రోజుల్లో ట్రాఫిక్ క్లియర్ చేయాలి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్లలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బంకులు, తోపుడు బండ్లను రెండ్రోజుల్లో తీసేయాలని పోలీసులు హెచ్చరించారు. సోమవారం ప్రజాశక్తిలో 'ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా..!' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పోలీసులు సోమవారం సాయంత్రం పట్టణంలో తిరుగుతూ.. రోడ్డును ఆక్రమించిన వ్యాపారాలను తొలగించాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

ప్రజాశక్తి - చాపాడు

చిన్న పెద్దయ్య

చాపాడు కొత్త ఎస్ గా చిన్న పెద్దయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్ఐగా పనిచేస్తున్న ఆర్‌వి కొండారెడ్డి పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఓబుళవారిపల్లెలో పనిచేస్తున్న చిన్న పెద్దయ్యను ఉన్నతాధికారులు చాపాడుకు నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలపై గట్టి చర్యలు చేపడతామన్నారు. ప్రజలు ఎవరైనా సమస్యలు ఉంటే నేరుగా తమను కలవవచ్చు అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు.

ఎస్ఐ జివి కృష్ణయ్య

చక్రాయపేట : శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జివి కృష్ణయ్య తెలిపారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. లింగాల నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెడతామన్నారు. గతంలో పనిచేసిన ఎస్ఐ వినోద్‌కుమార్ బదిలీ అయ్యారు.

ఎస్ఐ తిమోతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల ఎస్ఐగా తిమోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం వాటిపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం కన్వీనర్, నాయకులు

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

- పిఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని పిఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ కోరారు. ఆ మేకు సోమవారం ఆర్‌డిఒ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రాయలసీమ ప్రాంతం కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలకు నిలయమన్నారు. కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓ.నాగేంద్రబాబు, పిఆర్ఎస్ వైఎఫ్ జమ్మలమడుగు పట్టణ నాయకులు దినేష్, హరీష్, ప్రభాకర్, శ్రీరామ్ నాయక్, సునీల్, హరిచంద్ర, మస్తాన్, మురళి, వసంత్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ కృష్ణమూర్తి

అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేకదృష్టి పెడతామన్నారు. ఆయన గతంలో ఇక్కడ పనిచేస్తున్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ సల్మాన్‌రాజ్ రాప్తాడుకు బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది ఎంపిడిఒకు ఘనస్వాగతం పలికారు.

ఆర్‌ఐ షేక్షావల్లిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆర్ఐ సేవలు మరవలేనివి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్షావలి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఆర్ఐ పులివెందులకు బదిలీ అవుతున్న సందర్భంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఇక్కడికి పులివెందుల తహశీల్దార్ కార్యా లయంలో పనిచేస్తున్న సుజిత్‌ను బదిలీ చేశారు. తహశీల్దార్ గుర్రప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S. No. 337/2021

Canara Bank, Rep. by its Branch Manager, Sankarapuram Branch, Kadapa city.

...Petitioner/Plaintiff

Vs

G. Babaiah, S/o. G. Hussaian Sab, Residing at: A-Obayapalli, V.N Palli Manadal, YSR District.

...Respondent/Defendant

NOTICE

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S No. 337/2024, in the above court and same is posted for your appearance on 28/08/2024, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you.

//By order of the Hon'ble Court//

G.VENKATESWARA REDDY

Advocate,

KADAPA.